# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 11-07-2024** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **తన ఆస్ట్రియా పర్యటన చరిత్రాత్మకమైనదని... ఇది రెండు దేశాల స్నేహాన్ని మరింత బలోపేతం చేసిందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ తెలిపారు.**

2. **దేశ ఆర్థికాభివృద్ధికి విశాఖ ఉక్కు కర్మాగారం దోహదపడుతోందని కేంద్ర పరిశ్రమలు, ఉక్కు శాఖ మంత్రి కుమారస్వామి అన్నారు.**

3. **ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పునర్నిర్మాణం కోసం ఓ లక్ష్యంతో పనిచేస్తున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు.**

4. **ఆంధ్రప్రదేశ్‌లో ఒకటి నుంచి ఇంటర్మీడియట్ వరకు చదివే విద్యార్థులు 'అమ్మకు వందనం', 'స్టూడెంట్ కిట్' పథకాల ప్రయోజనాలు పొందడానికి ఆధార్ కలిగి ఉండాలని రాష్ట్ర ప్రభుత్వం సూచించింది.**

==============================

తన ఆస్ట్రియా పర్యటన చరిత్రాత్మకమైనదని... ఇది రెండు దేశాల స్నేహాన్ని మరింత బలోపేతం చేసిందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ తెలిపారు. ఆస్ట్రియా దేశ పర్యటనను ముగించిన ప్రధాని.. ఆస్ట్రియా ప్రభుత్వం, ఛాన్సలర్ కార్ల్ నెహమ్మర్, ఆ దేశ ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. వియన్నాలో ఆస్ట్రియా ఛాన్సలర్ నెహమ్మర్‌తో చర్చల అనంతరం ప్రధానమంత్రి మాట్లాడుతూ.. భారత్, ఆస్ట్రియా దేశాల మధ్య పరస్పర సహకారాన్ని మరింత బలోపేతం చేసుకునేందుకు కొత్త అవకాశాలను గుర్తించామని తెలిపారు. ఉక్రెయిన్ వివాదం, పశ్చిమాసియాలోని పరిస్థితులు సహా ప్రపంచంలోని ప్రస్తుత భౌగోళిక రాజకీయ పరిస్థితులపై కూడా తాము వివరణాత్మక చర్చలు జరిపినట్లు ఆస్ట్రియా ఛాన్సలర్‌తో కలిసి చేసిన సంయుక్త ప్రకటనలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలిపారు.

--------------------------

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పునర్నిర్మాణం కోసం ఓ లక్ష్యంతో పనిచేస్తున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. ఉత్తరాంధ్ర జిల్లాల పర్యటనలో భాగంగా ఈరోజు ఉదయం అనకాపల్లి చేరుకున్న ముఖ్యమంత్రి దార్లపూడి వద్ద పోలవరం ఎడమ కాలువను పరిశీలించారు. అనంతరం ఆయన అక్కడ ఏర్పాటు చేసిన సభలో మాట్లాడుతూ రాష్ట్ర పునర్ నిర్మాణ మిషన్‌లో అందరి మద్దతు అవసరమని పేర్కొన్నారు. నిన్న జరిపిన బీపీసీఎల్, విన్ ఫాస్ట్ సమావేశాలతో పెద్ద ఎత్తున పెట్టుబడులు, ఉద్యోగాల కల్పన సాధ్యమవుతుందని ముఖ్యమంత్రి మాట్లాడుతూ...

...వాయిస్...

అనంతరం మధ్యాహ్నం భోగాపురం విమానాశ్రయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సందర్శించి.. పనుల పురోగతిపై అధికారులతో సమీక్షిస్తారు. అనంతరం సీఐఐ కాన్ఫరెన్స్‌లో వర్చువల్‌గా పాల్గొంటారు. మెడ్‌టెక్ జోన్ వర్కర్లతో సమావేశమవుతారు. సాయంత్రం విశాఖ ఎయిర్‌పోర్టు లాంజ్‌లో అధికారులతో సమావేశమై.. ఐదేళ్లుగా నిలిచిపోయిన పలు ప్రాజెక్టుల స్థితిగతులపై సమీక్షిస్తారు.

---------------------------

దేశ ఆర్థికాభివృద్ధికి విశాఖ ఉక్కు కర్మాగారం దోహదపడుతోందని కేంద్ర పరిశ్రమలు, ఉక్కు శాఖ మంత్రి కుమారస్వామి అన్నారు. విశాఖ పర్యటనకు వచ్చిన ఆయన ఈరోజు ఉక్కు కర్మాగారాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన పాత్రికేయులతో మాట్లాడారు. విశాఖ ఉక్కు కర్మాగారంపై అనేక మంది ఆధారపడి ఉన్నారని.. దీన్ని రక్షించడం తమ బాధ్యత అని తెలిపారు. ప్లాంట్ మూతపడుతుందనే ఆందోళన వద్దని చెప్పారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ అండతో వంద శాతం సామర్థ్యంతో ఉత్పత్తి జరుగుతుందని కుమారస్వామి తెలిపారు. అంతకుముందు విశాఖ ఉక్కు పరిశ్రమలోని వివిధ విభాగాలను కేంద్రమంత్రి పరిశీలించారు.

---------------------------

ఎల్‌పీజీ సిలిండర్లకు సంబంధించి నకిలీ వినియోగదారులను తొలగించేందుకే ప్రభుత్వ అధీనంలోని చమురు రంగ సంస్థలు ఆధార్ ఆధారిత ఈ-కేవైసీ ధ్రువీకరణ ప్రక్రియ కొనసాగిస్తున్నట్లు కేంద్ర ఇంధన శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పురి తెలిపారు. కొన్ని గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ సంస్థలు నకిలీ వినియోగదారుల ఖాతాలతో వాణిజ్య సిలిండర్లు బుక్ చేస్తున్నాయని, దాన్ని అడ్డుకోవడానికే ఈ చర్య చేపట్టినట్లు స్పష్టం చేశారు. ఆధార్ ఈ-కేవైసీ ధ్రువీకరణపై కేంద్ర మంత్రి మాట్లాడుతూ ఈ-కేవైసీ ప్రక్రియ కోసం వినియోగదారులు ఏజెన్సీల వద్దకే వెళ్లాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. గ్యాస్ సిలిండర్‌ను డెలివరీ చేసే వ్యక్తులు తమ వద్ద ఉన్న యాప్ ద్వారా వినియోగదారుల ఆధార్ వివరాలు సేకరించి కేవైసీ ప్రక్రియను పూర్తి చేస్తారని పేర్కొన్నారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో ఒకటవ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు చదివే విద్యార్థులు 'అమ్మకు వందనం', 'స్టూడెంట్ కిట్' పథకాల ప్రయోజనాలు పొందడానికి ఆధార్ కలిగి ఉండాలని, ఒకవేళ లేకపోతే నమోదు కోసం దరఖాస్తు చేసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం సూచించింది. ఆధార్ వచ్చే వరకు 10 రకాల పత్రాలను పరిగణనలోకి తీసుకుంటామని వెల్లడించింది. ఈ మేరకు పాఠశాల విద్యా శాఖ కార్యదర్శి కోన శశిధర్ నిన్న ఉత్తర్వులు జారీ చేశారు. అమ్మకు వందనం పథకం కింద దారిద్ర్య రేఖకు దిగువన ఉండి, పాఠశాలలకు పిల్లల్ని పంపించే తల్లులు లేదా సంరక్షకులకు ఏడాదికి 15 వేల రూపాయల ఆర్థిక సాయం చేయనున్నారు. విద్యార్థులకు 75 శాతం హాజరు తప్పనిసరిగా ఉండాలని పేర్కొన్నారు.

---------------------------

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దేశాన్ని అభివృద్ధి బాటలో నడిపిస్తూ నిత్యం పేద ప్రజల గురించి ఆలోచిస్తున్నారని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. తిరుమల వెంకటేశ్వర స్వామిని ఈరోజు ఉదయం కేంద్ర మంత్రి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయం వెలుపల పాత్రికేయులతో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వంలో ఎర్రచందనం అక్రమ రవాణా, శ్రీవారి నిధులను పక్కదారి పట్టించడంపై కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా దృష్టికి తీసుకెళ్లి విచారణ జరిపిస్తామని కేంద్రమంత్రి బండి సంజయ్ మాట్లాడుతూ..

..వాయిస్..

---------------------------

ఆంధ్రప్రదేశ్ లో సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహాలకు ఇవ్వవలసిన బకాయిలు త్వరలో విడుదల చేస్తామని, వసతి గృహాల్లో ఖాళీలు భర్తీ చేస్తామని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖా మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి తెలిపారు. వెలగపూడిలోని సచివాలయంలో మంత్రి నిన్న ప్రజల నుంచి వినతి పత్రాలు స్వీకరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ....సాంఘిక సంక్షేమ శాఖ పాఠశాలలకు, పూర్వ వైభవం తీసుకొస్తామని విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తామని అన్నారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని పల్నాడు జిల్లా పిడుగురాళ్లలో డయేరియా కేసులపై మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ ఈ రోజు సమీక్ష నిర్వహించారు. మున్సిపల్, వైద్య ఆరోగ్య శాఖ అధికారులతో సమావేశమైన మంత్రి నారాయణ డయేరియాకు కారణాలు, నివారణకు తీసుకోవాల్సిన చర్యలను అడిగి తెలుకున్నారు. మున్సిపాలిటీ పరిధిలో మంచినీటి పైపులైన్ల లీకులపైనా మంత్రి నారాయణ సమీక్షించారు.

---------------------------

ప్రపంచ జనాభా దినోత్సం సందర్భంగా ఈరోజు రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో అధికారులు పలు అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. తిరుపతి, చిత్తూరు, ప్రకాశం, అనంతపురం తదితర జిల్లాల్లో ఆయా జిల్లాల కలెక్టర్లు జనాభా నియంత్రణకు అవగాహన ర్యాలీలను ప్రారంభించారు. చిత్తూరు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ మాట్లాడుతూ జనాభా నియంత్రణ దేశాభివృద్ధికి దోహదం చేస్తుందన్న విషయాన్ని ప్రతి ఒక్కరు గుర్తుంచుకోవాలన్నారు. ఈ సందర్భంగా ప్రకాశం జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా పాత్రికేయులతో మాట్లాడుతూ...

..వాయిస్..

---------------------------

ప్రపంచ వ్యాప్తంగా నానాటికీ పెరిగిపోతున్న జనాభా ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించే ఉద్దేశంతో ఈరోజు ప్రపంచ జనాభా దినోత్సవాన్ని జరుపుకుంటున్నాం. జనాభా పెరుగుదల, తగ్గుదలకు సంబంధించిన అంశాలపై ఈ సందర్భంగా ప్రజల్లో అవగాహన కల్పిస్తారు. 1987 జులై 11వ తేదీన జన్మించిన శిశువుతో ప్రపంచ జనాభా ఐదు బిలియన్లకు చేరుకుంది. ఆ సందర్భాన్ని పురస్కరించుకుని ప్రతిఏటా జులై 11న ప్రపంచ జనాభా దినోత్సవంగా పాటించాలని ఐక్యరాజ్యసమితి పిలుపునిచ్చింది. "ఎవరిని వదిలిపెట్టకుండా ప్రతీ ఒక్కరిని లెక్కించండి" అనే ఇతివృత్తంతో ఈ ఏడాది ప్రపంచ జనాభా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. 2050వ సంవత్సరం నాటికి ప్రపంచ జనాభా భారీగా పెరిగే అవకాశం ఉన్నందున తమ తమ దేశాల్లో ఆయా ప్రభుత్వాలు అందుకు అనుగుణంగా తగిన ప్రణాళికలు రూపొందించుకోవాలని ఐక్యరాజ్యసమితి సూచిస్తోంది.

---------------------------

నీట్ యూజీలో అవకతవకలు జరిగాయనడానికి గానీ, కొన్ని కేంద్రాల్లో విద్యార్థులు లబ్ధి పొందేలా అక్రమాలు జరిగాయనడానికి గానీ ఆధారాల్లేవని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. మద్రాస్ ఐఐటీ నిర్వహించిన ఈ పరీక్ష ఫలితాల సమాచార విశ్లేషణలో.. మార్కుల పంపిణీలో అసాధారణ అంశాలేవీ కనిపించలేదని పేర్కొంది. మార్కులు సాధారణంగానే ఉన్నాయని నిన్న సుప్రీంకోర్టుకు సమర్పించిన అదనపు అఫిడవిట్‌లో కేంద్రం వివరించింది. నీట్ యూజీపై ఈరోజు భారత ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలోని ధర్మాసనం విచారణ జరపనుంది. ఈ నేపథ్యంలో కేంద్రం ఈ అఫిడవిట్ సమర్పించింది.

=====================